UNIVERSITY OF CAMBRIDGE INTERNATIONAL EXAMINATIONS
General Certificate of Education Advanced Subsidiary Level and Advanced Level

**TELUGU** **8690/02**
**9690/02**

Paper 2 Reading and Writing **October/November 2008**

**1 hour 45 minutes**

Additional Materials: Answer Booklet/Paper

**READ THESE INSTRUCTIONS FIRST**

If you have been given an Answer Booklet, follow the instructions on the front cover of the Booklet.
Write your Centre number, candidate number and name on all the work you hand in.
Write in dark blue or black pen.
Do not use staples, paper clips, highlighters, glue or correction fluid.

Answer **all** questions.
Write your answers in **Telugu** on the separate answer paper provided.
Dictionaries are **not** permitted.
You should keep to any word limits given in the questions.

At the end of the examination, fasten all your work securely together.
The number of marks is given in brackets [ ] at the end of each question or part question.

**ఈ సూచనలను ముందుగా చదవండి.**

మీకిచ్చిన ప్రత్యుత్తర పత్రంలోని ముఖపత్రం మీది సూచనలను పాటించండి.

మీరు అందించే ప్రత్యుత్తరపత్రం/పత్రసంపుటి మీద మీపేరు, కేంద్రం సంఖ్య, అభ్యర్థి సంఖ్య రాసి నింపండి.

రాయడానికి ముదురునీలం లేదా నలుపురంగు సిరాకలాలనే వాడండి.

స్టేపిల్సు, పేపరు క్లిప్పులు, హైలైటర్లు, గ్లూ లేదా చెరుపుడు ద్రవాలు వాడకండి.

**అన్ని** ప్రశ్నలకు జవాబులు రాయండి.

అందించిన ప్రత్యుత్తరపత్రంలో మీ జవాబులను **తెలుగులో** రాయండి.

పదకోశాలకు అనుమతి **లేదు**.

ప్రశ్నల్లో సూచింపబడ్డ పదపరిమితిని పాటించండి.

పరీక్షకాగానే ప్రత్యుత్తర పత్రాలన్నిటినీ ఒకటిగా గుదికూర్చి కట్టండి.

ప్రతిప్రశ్నకు లేదా ప్రశ్నాంశానికి చివర కుండలీకరణం [ ] గుర్తుల్లో గుణములు సూచింపబడ్డవి.

This document consists of **6** printed pages and **2** blank pages.

(NH) T52641/2
© UCLES 2008

UNIVERSITY *of* CAMBRIDGE
International Examinations

**[Turn over**

www.theallpapers.com

## విభాగం 1

ముందుగా ఈ మొదటిపాఠ్యాన్ని చదివి, ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు **తెలుగు**లో జవాబులు రాయండి.

### కొండరెడ్లు

తెలియని అక్షరాలకు తెలిసిన పదాలు వింటూ గూడెం పిల్లలు చకచకా రాసుకుంటూపోతున్నారు. నిజానికి వాళ్లు ఇంతకుమునుపు ఇంత సులువు ఎరగ లేదు. తమ ఇళ్లలోని మాటలను స్కూల్లోకి తెచ్చి ఇంత హుషారుగా దిద్దలేదు. అందుకే వాళ్లముఖాల్లో సంతోషం. వాళ్ల చేతివేళ్లలో పరుగులిడే వేగం. పూర్వం తన బొటనవేలును కోల్పోయిన ఏకలవ్యుడనే గిరిజనవిలుకాడు ఎంత భవిష్యత్తును నష్టపోయాడో తెలియదుకానీ, తమ జాతికి కీలక అంగుష్ఠమైన ఈ ఇంటిభాషను కోల్పోవడానికి మాత్రం ఇప్పటి గిరిజనులు సిద్ధంగా లేరు.

అయితే వారు మెజారిటీభాషల ఉప్పెనను తట్టుకోవడానికి తమ సొంతవాచకాలను తయారుచేసుకొంటున్నారు. డాక్టర్ రెడ్డి ఫౌండేషన్ సహకారంతో వీళ్లు తెచ్చుకున్న పుస్తకాలు ఈ పట్టుదలలో మొదటి అడుగు మాత్రమే.

పోలవరం భద్రాచలానికి తొంభై కిలోమీటర్ల దూరంలో గోదావరిగట్టుమీద ఉంది. ఫెర్టిలిటీరేటు పడిపోయి జనాభా తీవ్రంగా తగ్గిపోతున్న కొండరెడ్డితెగకు ఆవైపు ఘనంగా చెప్పుకోవడానికి ఆ ఊరొకటే ఉంది. పోలవరం ప్రాజెక్టు పనిసాగితే అదీ చెల్లాచెదురైపోతుంది. కానీ ఆ దిగులు మంగిరెడ్డి కళ్లలో కాసేపే కనిపించింది. అంతలోనే ఉత్సాహంగా "పదండి మాస్కూలు చూద్దురుగాని" అంటూ ఊరివాళ్లతోపాటు స్కూలువైపు తీసుకెళ్లాడు. విశాలమైన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పలుచగాఉన్నా వాళ్లగొంతులు మాత్రం ఖణేల్‌మని మోగుతున్నాయి.

"కొండరెడ్డి వాచకం... కొండరెడ్డి పద్యాలు... వచ్చాక మా పిల్లలకు కొత్త ఉత్సాహం వచ్చింది. వాళ్లు తమ మాటల్ని పుస్తకాల్లో చూసి సంబరంగా చదువుకుంటున్నారు" అన్నాడు కనకారెడ్డి అనే ఒక కొండరెడ్డి యువకుడు. కొండరెడ్డి వాచకాలను కూర్చేపనికి ఏర్పాటైన యువకుల బృందంలో కనకారెడ్డి చాలా ఉత్సాహంగా పనిచేశాడు. పిల్లలు అక్షరాలను నేర్చుకునేందుకు వీలుగా వాళ్లకు పనికివచ్చే పద్యాలను అనేకం అల్లాడు. కనకారెడ్డి తాత ముర్ల యర్రయ్యారెడ్డి భద్రాచలానికి ఎం.ఎల్.ఏ.గా పనిచేశాడు. ఆయన హయాంలో కూడా జరగనిపని ఇప్పుడు తన హయాంలో జరిగిందని కనకారెడ్డికి గర్వంగా ఉంది.

"మా పిల్లలు బడికిపోరు. భయం. వాళ్లను బడికి తీసుకువచ్చే తాయిలం కావాలి. బెదరగొట్టని పాఠాలు ఉండాలి. పుస్తకాల్లో వాళ్లకు పరిచయమున్న విషయాలు ఉండాలి. కొండరెడ్డి వాచకాలను మేము కొన్ని స్కూళ్లల్లో ఉచితంగా పంచాం. వాటిని చూసి పిల్లలేకాదు, తల్లిదండ్రులు కూడా చాలా సంతోషిస్తున్నారు. ఆశ్చర్యపోతున్నారు. తమభాషనుకూడా లెక్కలోకి తీసుకుంటున్నారన్న సంగతి వాళ్లకు గొప్ప ఆత్మవిశ్వాసం ఇచ్చి పిల్లలను బడికి పంపవచ్చునన్న నమ్మకం కలిగిస్తోంది. నిజానికి ఇలాంటి పని కొన్ని దశాబ్దాలకుమునుపు జరిగి ఉంటే మాతెగ చదువులో చాలా ముందుండేది" అన్నాడు రామారావు అనే మరో కొండరెడ్డి యువకుడు. అతడూ కొండరెడ్డి పద్యాలు బోలెడన్ని రాశాడు. ఇవన్నీ తెలుగులోనే ఉంటాయి. కానీ కొండరెడ్లు కాపాడుకుంటున్న తెలుగువేరు. కొన్ని మాటలు పూర్తిగా భిన్నం 'పొల్లు అక్షరాల' వాడుక విస్తృతం పిల్లలకు అచ్చులు పరిచయం చేయడానికి రామారావు అల్లినపద్యం చూడండి.

"అడవికి పోయిడ్ నాన్న - ఆవుపాలుపిండి అమ్మ
ఇప్పపువ్వు ఏరబోయిడ్‌తాత - ఈతకుపోయి అక్క
ఉడుముపట్టు పట్టిడ్ మామ - ఊతమోసుకుపోయిడ్ బావ
ఎలుకను పట్టి పిల్లి - ఏటిలోను ఉన్నె నావ
ఒడకి ఉన్నె తెరచాప - ఔజం మోత మోగి
అందరం కలిసి ఆడితిం"



www.theallpapers.com

ప్రామాణిక తెలుగు వాచకాల్లో ఇలాంటి పద్యాన్ని ఊహించడం కష్టం. అడవి, ఇప్పపువ్వు, ఉడుము వంటి మాటలు లేకుండా కొండరెడ్ల తెలుగు నేర్చుకోవాలంటే కష్టం. ఔజం అంటే కొండరెడ్లు మోగించే డోలు. దీనిని వేరొక తెగవారు ఉపయోగించరు. అందుకే ఇలాంటి మాటలతో వాళ్లకు తెలుగు నేర్పిస్తే పిల్లలు ఉత్సాహంతో చదువుకుంటారు. ఇంటిభాషతోపాటు ప్రామాణిక తెలుగునుకూడా ఎంతో సులువుగా నేర్చుకుంటారు అనే ఆలోచన వచ్చింది రెడ్డి ఫౌండేషన్‌కు. ఈ వాచకాల ద్వారా వాళ్లు ఆశిస్తున్నప్రయోజనం ఇదే.

**1** దిగువ పేర్కొన్న అర్థవివరణలకు బాగా సరిపోయిన పదాలు/పదబంధాలు మీది పాఠ్యంలో ఉన్నవి. వాటిని గుర్తించి రాయండి.

మాదిరి : కోల్పోయిన

ఉత్తరం : కాలిపోయిన ( ); పోగొట్టుకున్న (✔); విరిగిన ( ).

(అ) *అంగుష్ఠము :* చిటికెనవేలు ( ); చూపుడువేలు ( ); బొటనవేలు ( ) [1]

(ఆ) *ఉప్పెన :* గాలి దుమారం ( ); ఋతుపవనం ( ); సముద్రపు తుఫాను ( ) [1]

(ఇ) *మొదటి అడుగు* : తొలి ప్రశ్న ( ); తొలి మెట్టు ( ); పైకప్పు ( ) [1]

(ఈ) *పలుచగా* : తక్కువగా ( ); అధికంగా ( ); భారంగా ( ) [1]

(ఉ) *తాయిలం* : తల్లి ( ); మాతృభూమి ( ); మిఠాయి ( ) [1]

[మొత్తం గుణములు 5]

**2** కింది గీట్లు గలవానిని ప్రశ్నించినవిధంగా భాషారూపాలను మార్చి, వాక్యాలను సరిచేసి రాయండి.

మాదిరి : ఇంటిభాష (పర్యాయరూపం)

ఉత్తరం : మాతృభాష

(అ) వాళ్ళ ముఖాల్లో (ఏకవచనంలోకి మార్చి రాయండి.) [1]

(ఆ) గిరిజనులు సిద్ధంగా లేరు (వ్యతిరేకార్థంలో వాక్యాన్ని మార్చి రాయండి.) [1]

(ఇ) తలిదండ్రులు సంతోషిస్తున్నారు. ఆశ్చర్యపోతున్నారు

(ఈ రెండు వాక్యాలను ఒక వాక్యంగా మార్చి రాయండి) [1]

(ఈ) కొన్ని దశాబ్దాలకు మునుపు ('కొన్ని'కి బదులు 'ఒక' అని మార్చి వాక్యాన్ని సరిచేయండి.) [1]

(ఉ) ఉత్సాహంతో చదువుకుంటున్నారు.

(పై వాక్యంలోని క్రియారూపాన్ని వర్తమాన వ్యతిరేకార్థంలోకి మార్చి రాయండి.) [1]

[మొత్తం గుణములు 5]

© UCLES 2008

www.theallpapers.com

3 మీది పాఠ్యంలోని వాక్యాలనే మక్కికిమక్కీ దించకుండా కింది ప్రశ్నలకు **తెలుగులో** మీసొంత వాక్యాలలో ప్రత్యుత్తరాలు రాయండి.

(ప్రతి ప్రశ్న చివర గుణములు గుర్తించబడ్డవి. భాషాపాటవానికి అదనంగా 5 గుణములున్నాయి. వెరసి ఈ ప్రశ్నకు మొత్తం 15+5 = 20 గుణములు).

(అ) చదువుకొనే విద్యార్థుల ముఖాల్లో సంతోషం కానరావడానికిగల రెండు కారణాలు గుర్తించండి. [2]

(ఆ) ఏకలవ్యుడికథలో అతనికి జరిగిన అన్యాయమేమిటో వివరించండి. [2]

(ఇ) మంగిరెడ్డి కళ్లలోని దిగులుకీ ఉత్సాహానికీగల కారణాలేమిటో వివరించండి. [2]

(ఈ) కొండరెడ్డి తెగవారి పిల్లల్లో బడిభయాన్నిపోగొట్టి ప్రోత్సహించిన మూడు అంశాలను గుర్తించి విశదీకరించండి. [3]

(ఉ) "కొండరెడ్లు కాపాడుకుంటున్న తెలుగు వేరు" అని భావించడానికిగల కారణాలను సోదాహరణంగా వివరించండి. [4]

(ఊ) "తెలియని అక్షరాలకు తెలిసిన పదాలు వింటూ గూడెం పిల్లలు" పొందిన ఆనందంలోని ఔచిత్యాన్ని వివరించండి. [2]

భాషాపాటవానికి : 5

[మొత్తం గుణములు 20]



www.theallpapers.com

## విభాగం 2

ఇప్పుడు ఈ దిగువనున్న రెండోపాఠ్యాన్ని చదివి, ఆ తరువాత అడిగిన ప్రశ్నలకు **తెలుగులో** జవాబులు రాయండి.

### కోయలు

కోయలలో మతప్రచారంచేసే కొందరు ప్రచారకులు కోయలను ఆకట్టుకోవడానికి 'దేవుడా! కోయభాషకు లిపిని కనిపెట్టే రోజులను తొందరగా తీసుకురా' అని ప్రార్థన చేస్తుంటారు.

దురదృష్టవశాత్తూ ఆ ప్రార్థన నేటివరకూ తీరలేదు. ఛత్తీస్‌గడ్ నుంచి కోయభాషలో టీవీ కార్యక్రమాలు కూడా వస్తున్నాయి. కానీ దాదాపు నాలుగైదు లక్షలమంది కోయలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో వారి భాషకు సంబంధించి ప్రభుత్వం వైపుగా జరిగిన ప్రయత్నం బహుస్వల్పం. రెండేళ్లక్రితం తీసుకొచ్చిన కోయవాచకం ఒక మంచి ప్రయత్నమేతప్ప చాలినంత ప్రయత్నంకాదు. ఈ వెలితి కోయలను చాలా బాధిస్తోంది. ముఖ్యంగా ఇంటా బయటా కోయమాట్లాడే పిల్లలకు బడిలో అన్యభాషలు, అన్యపదాలు వినిపించి భయాందోళనలకు గురిచేస్తున్నాయి. తరగతిలో పిల్లలు నోరుమెదపడంకూడా కష్టమైపోతున్నది. టీచరు చెప్పేది పిల్లలకు అర్థంకాదు. పిల్లలు అడుగుతున్నది టీచర్లకు బోధపడదు.

"ఈ బాధవల్లే మేము, డిగ్రీ పాసయినా తప్పులు లేకుండా తెలుగు రాయలేకపోతున్నాం' అన్నాడు ముత్తయ్య అనే కోయ యువకుడు. అతడు కోయవాచకం రూపకల్పనలో కీలక పాత్రధారి.

అన్నవరం అనే కోయగూడెంలో చెట్టుకింద కోయపిల్లలందరినీ కూర్చోబెట్టి వాళ్లచేత తెలుగు లిపిలోఉన్న కోయ పద్యాలను చదివిస్తున్నప్పుడు అతడి కళ్లలోనే కాదు, వారి చుట్టూ చేరిన గూడెంపెద్దల కళ్లలోనూ బోలెడంత ఆనందం కనిపించింది. కోయపెద్దల సమక్షంలో పిల్లలు హుషారుగా చదివిన కోయపద్యం చూడండి. ఈ పద్యం కోయలకు అతిముఖ్యమైన 'భూమి పండగ' మీద రాసింది.

"వత్తె వత్తె కర్రెపండుమ్ (వచ్చెవచ్చె భూమి పండుగ)  
పోయిమ్ పోయిమ్ విల్‌పోయిమ్ (పట్టు పట్టు అమ్మపట్టు)  
తర్ర తర్ర మెట్టతర్ర (ఎక్కు ఎక్కు గుట్ట ఎక్కు)  
వడస వడస జీవంవడస (కొట్టు కొట్టు జీవం కొట్టు)....."

"మొదట మేము ఇలాటి పద్యాలను తెలుగులో వినిపించాము. పిల్లలు మామూలుగా వల్లెవేశారు. వీటినే కోయలో వినిపించాం. ఎంతో ఆనందించారు పిల్లలు" అన్నాడు బాబూరావు అనే మరో కోయయువకుడు. "కోయలందరూ తెలుగు మాట్లాడగలరు. కానీ మాలో మేము ఎప్పుడూ కోయలోనే మాట్లాడుకుంటాం. మేము కోరేది ఒక్కటే... ఇంటిభాష రాకపోతే ఏభాషారాదని అంటారు. మొదట మా ఇంటిభాషకు దగ్గరచేయండి. ఆ తర్వాతనే తక్కిన భాషలు. ఆపని చేయకుండా ఎన్ని స్కూళ్లు, భోజనపథకాలు పెట్టినా లాభం లేదు" అన్నారు అక్కడి కోయపెద్దలు.

కోయ, కొండరెడ్డి భాషల్లో వాచకాలు రావాలనే ఆలోచనకు మద్దతు ఇవ్వడానికి రెడ్డి ఫౌండేషన్ ముందుకు వచ్చింది. చదువుకున్న కోయ, కొండరెడ్డి యువకులతో సమావేశాలుపెట్టి వాళ్ల కులసంప్రదాయాలు, పండుగలు, వేట పరికరాలు, వన్యమృగాలు, పంటలు, పిట్టలు వగైరాలకు సంబంధించిన పదాలన్నీ సేకరించారు. ఆతర్వాత ప్రతి అక్షరానికీ తగిన స్థానిక పదాలను జతచేస్తూ కొత్తవాచకాలు కూర్చారు. కథలు, పద్యాలు, పొడుపు కథలు కూడా సేకరించారు. ఈ పదాలకే కోయభాషలలో 'వేసోడీలు', 'మిడికోసలు', 'విప్పన్‌కతలు' అనేవి పర్యాయవాచకాలు.

ప్రస్తుతం ఎంపికచేసిన కొన్ని స్కూళ్లలో ఈ పుస్తకాలను పంచుతున్నారు. ఈ మొత్తం పనికి వాసిరెడ్డి శరత్ నిర్దేశకులు. మృదుల సహపర్యవేక్షకులు. టీచర్ల స్పందనకూడా ఈ వాచకాల ప్రయోగానికి అనుకూలంగా ఉండడం మెచ్చదగిన విషయం. ఈ కృషికి ప్రభుత్వంవైపునుంచి సహకారం ఉంటుందనీ, కోయల, కొండరెడ్ల భాష పరిరక్షితం కాగలదనీ ఆశిద్దాం.


www.theallpapers.com

4 కింది ప్రశ్నలకు **తెలుగులో** జవాబులు రాయండి. పాఠ్యంలోని వాక్యాంశాలనే మక్కికి మక్కీ దించకుండా మీ సొంత వాక్యాలలో రాయండి.

(ప్రతి ప్రశ్న చివర గుణములు గుర్తించబడ్డవి. భాషాపాటవానికి అదనంగా 5 గుణములున్నాయి. వెరసి ఈ ప్రశ్నకు మొత్తం 15+5=20 గుణములు.)

(అ) కోయభాషకు కోయలిపి విడిగా అవసరమా? పరిశీలించి భాషకు లిపికి మధ్యగల సంబంధం ఏలాంటిదో వివరించండి. [2]

(ఆ) కోయవాచకాల రూపకల్పనలో జరిగిన కృషిని వివరించండి. [4]

(ఇ) "ఇంటిభాషరాకపోతే ఏభాషా రాదని అంటారు" - ఈభావనలోని ఔచిత్యాన్ని వివరించండి. [3]

(ఈ) "విప్పన్‌కతలు" అంటే ఏమిటి? వాటిని తెలుగులో ఏమంటారో వివరించండి. [2]

(ఉ) కోయభాషాసేవ చేయడంలో మతప్రచారకులదృష్టి ఎలాంటిదో వివరించండి. [2]

(ఊ) కోయవాచకాల రూపకల్పనలో రెడ్డి ఫౌండేషన్‌వారికి స్థానికులిచ్చిన మద్దతును గురించి రాయండి. [2]

భాషాపాటవానికి : 5

[మొత్తం గుణములు 20]

5 కింది ప్రశ్నకు **తెలుగులో** జవాబు రాయండి. మీ ప్రత్యుత్తరం 140 పదాలపరిమితికి మించరాదు.

కోయల, కొండరెడ్ల భాష పరిరక్షితంకాగలదని ఆశించడానికి వెనుకగల రెడ్డి ఫౌండేషన్‌వారి కృషిని సమీక్షించండి. [15]

భాషాపాటవానికి : 5

[మొత్తం గుణములు 20]



www.theallpapers.com

BLANK PAGE



www.theallpapers.com

BLANK PAGE

*Copyright Acknowledgements:*

Passage 1 © *Sunday Andhrajyoti*, 16 July 2006.
Passage 2 © *Sunday Andhrajyoti*, 16 July 2006.

Permission to reproduce items where third-party owned material protected by copyright is included has been sought and cleared where possible. Every reasonable effort has been made by the publisher (UCLES) to trace copyright holders, but if any items requiring clearance have unwittingly been included, the publisher will be pleased to make amends at the earliest possible opportunity.

University of Cambridge International Examinations is part of the Cambridge Assessment Group. Cambridge Assessment is the brand name of University of Cambridge Local Examinations Syndicate (UCLES), which is itself a department of the University of Cambridge.



www.theallpapers.com